

# సాలెగూడు

*మంచీ చెడూ కలిసే ఉంటాయి. కనుక చెడు పూర్తిగా వర్జించడం సాధ్యం కాదు. హద్దుమీరనివ్వరాదు. అంతే. ఆలోచనలు కూడా అలాంటివే.*

సాంబశివరావు అలసటగా ఇంట్లోకి ప్రవేశించి వాల్చిఉన్న నులక మంచానికి అడ్డంగా నడుము వాల్చి ఉస్సురన్నాడు. భారంగా కళ్ళు మూసుకున్నాడు. చిన్నతనంలోనూ, జవ్వనంలోనూ కష్టాలన్నీ కాచి వడపోయగా తేరిన వ్యక్తి అతడు. యౌవన కాలచక్రపు చలనపరిమితి ఇంకా ముగియకున్నా, నడివయస్సు పోకడలు అతన్ని వడమంత్రంగా చుట్టివేసి గిర్రున త్రిప్పుతున్నాయి. ఇప్పుడు స్థితిగతులు బాగున్నాయి. కూడుగుడ్డలకేమీ లోటులేదు. తిండిగింజలు తేల్చి తెచ్చే పొలం ఉంది. పైపెచ్చు గుమాస్తా గిరీ వెలగబెడుతున్నాడు. భార్యా, పిల్లలూ సలక్షణంగా ఉన్నారు. అందరూ ఇతగాణ్ణి చూస్తె హడిలి చస్తారు.

సాంబశివరావు తేలికగా, విక్షిప్తంగా కళ్ళు తెరిచాడు. నల్లని ఇంటివాసాలతని దృష్టిపథంలోనికి వచ్చాయి. ఏ నాటిదో ఆ పూరిల్లు! పూరిల్లైనా విశాలంగా ఉంటుంది. కనీసం పెంకుటిల్లైనా కట్టించమని ఎందరు చెప్పినా తన పూర్వికుల నుంచీ చెక్కు చెదరకుండా ఉన్న ఆ యింటి మీద తగని అభిమానంతో అలాగే ఉండిపోయాడు. అతడు ఇంటినెప్పుడూ శుభ్రంగా ఉంచుకుంటాడు.


హఠాత్తుగా అతని సింహావలోకనానికి అంతరాయం కలిగింది. దీక్షగా పరికించి చూచాడు. నడికప్పున ఓ మూలగా తెల్లని వలలు పన్నే సాలెపురుగు అతని కంటబడింది. అలాగే చూస్తూ ఉండిపోయాడు. ఏమిటి! ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ అతి జాగ్రత్తగా ఉండే తన యింట్లో సాలెగూడా!! మంచి, చెడ్డకు తావిచ్చిందా? ఇయ్యక పోయినా అదే స్థానం కల్పించుకొని ఉంటుంది. కాని తానిప్పుడు తలచుకుంటే అది ఎట్లా మనగలుగుతుంది?

అతడలాగే చూపులో ఆలోచనను మేళవించి ఉండిపోయాడు. ఊహుఁ! కాదు. అంతా శుభ్రంగా ఉన్నచోట ఈ ప్రత్యేకత చెడ్డదైనా అందంగానే ఉన్నట్టుంది. కానీ .... దాన్ని అంతకు మించకుండా పరిమితిలో ఉంచుదాం.

కాని, ఇది చెడ్డ అనటంలో సందేహమే లేదు. సాలెపురుగు వలలు పన్నుతూనే ఉంది. గూడు దట్టంగా అల్లుకు పోతూ ఉంది. అతడు పని లేకుండా తీరిగ్గా ఉన్నప్పుడెల్లా మంచం మీద పడుకొని అలాగే ఆ సాలె గూడును చూస్తూ ఉన్నాడు. ఇంత మంచి ఉన్నప్పుడు ఈ కాస్త చెడు ఏం చెయ్యగలదు? హాఁ! .... చెడ్డ ఇప్పుడు తన నిగ్రహానుగ్రహాల మీద ఆధారపడి ఉంది. అయినా చెడును మననీయుటమా!!?... ఓ వారం గడిచింది.

తను లేనప్పుడు సాలెగూడును దులిపేస్తారేమోనవే అనుమానం కలిగింది. ఓ రోజు ఇంటిలోని వారిని అందరినీ సమావేశ పరిచి ఒక తిరుగులేని ఆజ్ఞను జారీ చేశాడు. "ఎవ్వరూ, ఎప్పుడూ, ఏ కారణంచేతనూ ఆ సాలెగూడును ముట్టుకోగూడదు." ఇంట్లో అందరూ విస్మయం పొందారు. ఏమిటి? ఇతగాడికేమైనా పిచ్చా! అసహ్యంగా ఉన్న సాలెగూడును కదిలించ వద్దంటాడేమిటి?

కాని వాళ్ళెవ్వరూ కిక్కురుమనలేదు. ఇమ్మహానుభావుని కోప ఫలితమేమిటో దృష్టాంత పూర్వకంగా చవిచూచి ఉన్నారు. అయినా, ఎందుకైనా మంచిదని, సాంబశివరావు ఇంటి బూజు



పులిచెర్ల సుబ్బారావు

శంకర్



పేల్‌గామ్ పట్టణ దృశ్యం (కాశ్మీరు) ఫోటో—ఆనంద్ పి. ముద్కక్ (బొంబాయి-14)

జరిపే పనికి గల సర్వహక్కులూ భుక్తం చేసుకున్నాడు. సాలెగూడుకు గల పరిమితికి కొన్ని గుర్తులు లిఖించాడు. దాన్ని అంతకు మించి రానీయకుండా ఉంచాడు. సాలెగూడు ఉన్నంతలో వృద్ధి పొందింది.

అతడు రోజూ దాన్ని చూస్తూ మంచి చెడ్డల తారతమ్యాలను గురించి తలపోస్తున్నాడు. ఇది ఎంత చెడ్డగా తోస్తూ ఉన్నా, కొన్ని జీవుల కాధారమేగదా! అయినా ఏది మంచి? ఏది చెడ్డ? ఒక వేళ గూడే మంచి, తన యిల్లే చెడు కాగూడదా? తను నిజంగా పిచ్చివాడి నయానేమోననిపిస్తుంది ఒక్కొక్కసారి. చివరికి తనకు తెలియకుండానే ఆ చెడు మీద మమకారాన్ని పెంచుకున్నాడు. తనలో ఏ చెడూ లేక పోవటం వలన బాహ్యమైనా ఈ చెడును పెంచుతూ ఉన్నానేమోనని భయపడ్డాడొకసారి. నెలలు గడిచాయి. ఈ లోగా సాంబశివరావు స్థితిగతులు అభివృద్ధి చెందాయి. దూరపు బంధువైన ఓ ముసలావిడ చచ్చింది. అతని యింటిలో ఎల్లెడలా సంతోషం వెల్లివిరిసింది. ఎందుకంటే ఇప్పటి అతని ఆస్తికి రెండింతలు ఆవిడ చావడంతో మారు మాటాడకుండా ఇతగాడి పరమై కూర్చుంది. పొలాల్లో పంటలు బాగా పండాయి. పాడి పంటలతో ఇల్లు కళకళ లాడుతూంటే, ఈ సారికూడా మగ పిల్లాడే కలిగాడు.

అతని పట్టరాని సంతోషం కులుకుగా వెలు

# సాలెగూడు

వడుతూంది. మంచంమీద వాలి సాలెగూడు వైపు చూచాడు. గూడు సాంద్రత ఉచ్ఛస్థాయిలో ఉంది. అల్లిక పోగులు అధికమవుతున్నాయి. ఇది చెడ్డా? కాదు మంచే... ఇదే అసలు మంచి అంటే! దీని ఉనికి వలననే సిరి సంపదలు పెరుగుతున్నాయి. తన సౌభాగ్య సౌధాన్ని ఈ గూడే సూచిస్తూంది అనుకున్నాడు. కాని కొద్ది సేపటికి యథాస్థితికి వచ్చాడు. ఛ! ఎంతైనా చెడు చెడే. సాలెగూడు చెడే. కాన్నే!

అతనికి ఆ గూడుమీది ప్రేముడి ఎక్కువై పోతూంది. మంచో, చెడో, అదంతా తనకనవసరం. ఇది మొత్తంమీద అచ్చాయంగానే ఉంది. అది చాలు.

ఇలా ఉండగా ఓ రోజు అతని అత్తమామలిద్దరూ తిథీ నక్షత్రం చూసుకునే అతిథులుగా దిగారు.

వాళ్ళంటే సాంబశివరావుకు మంట. అయినా తన భార్య వారి ఏకైకసంతానం కావటం చేత, వారి ఆస్తిమీద కన్నువేసి ఉన్నాడు. కనుక వాళ్ళకు మర్యాదలు జరిపాడు. వాళ్ళు మనుమలతో ఆడుకుంటూ కులాసాగా ఉన్నారు.

ఓనాటి మధ్యాహ్నం అతడి అత్తగారు అల్లుని సంసారానికి సహాయపడ దలచినదై నది. కూతురు పెరట్లో పని చేసుకుంటూంది. భర్త సుష్ఠుగా తిని గుర్రుపెట్టి నిద్రిస్తున్నాడు. అల్లుడుగారింట్లో లేరు. చిన్న మనవడు ఉయ్యాల్లో ఉన్నాడు. పెద్దాడు పంచలో చదువుకుంటున్నాడు. మరునాడు పండుగ. ఇల్లంతా శుభ్రంగాఉంటే ఇక తనేమిటి బాగు చెయ్యటం! తలెత్తి చూచింది.

అల్లుని ఆశాసౌధం అత్త కంటబడింది. వెన్వెంటనే మచ్చుమీదికెక్కింది. చదువుకునే మనవడు చదువాపి లోపలకు చూచాడు. అమ్మమ్మ సాలెగూడును సమూల విధ్వంసం చేసింది చాలక పట్టె వాసాలను ఊరికే దులుపుతూంది.


"అమ్మోయ్!" ఆ అబ్బాయి కేకకు ఇంటిల్లిపాదీ ఉలిక్కిపడింది. గుర్రుపెట్టే తాత లేచి కూర్చున్నాడు. అమ్మ పెరట్లోంచి పరుగెత్తుకు వచ్చింది.

"అమ్మా! అమ్మమ్మ సాలెగూడుని దులిపేసింది, చూడు."

బోసిపోయిన ఇంటిమూలలను చూచి సాంబశివరావు భార్య గతుక్కుమంది.

"ఏమిటే? అట్లానోరు తెరుచుకొని చూస్తావ్? ఇల్లంతా శుభ్రంగా ఉంటే ఈ సాలెగూడే మిటే?"

"ఓయమ్మో! ఇంకేముంది? నీయల్లుడు దాన్ని ముట్టుకోనీయకుండా ఇంతకాలమూ



నఖి సరస్సు (మౌంట్ అబూ) ఫోటో—ఎల్. ఎల్. కాక్‌షాక్ (బొంబాయి)

ఉండనిచ్చాడు. ఇప్పుడెట్లా? వచ్చి చంపేస్తాడు."

"ఎవర్నే చంపేసేది? ఏమంత నేరం చేశా మని చంపుతాడు! ఎంత విచిత్రమే!"

సాంబశివరావు అత్త పేరుమోసిన గయ్యాళి. ఆమె నోరంటే ఎటువంటి వారికి కూడా హడల్.

కాని ఇప్పుడామె కూతురు వణికిపోతూంది.

"ఏమిటే అట్లా భయపడతావ్? పోనీ నీకు భయమయితే నేనే చెబుతాలే" అని సాంబశివరావు రాకకు ఎదురు చూస్తూ వాకిట్లో కూర్చుంది.

తన గయ్యాళిభార్యకూ, కోపదారి అల్లుడికీ హోరాహోరి పోరాటం తథ్యమని తెలిసిన మామగారు చిన్నగా బయటికి వెళ్ళిపోయారు.

అల్లంత దూరాన నడిచి వచ్చే అల్లుణ్ణి చూడగానే అత్తగారి మేకపోతు గాంభీర్యం పటాపంచలైంది. అతణ్ణేమీ కదిలించలేదు. సాంబశివరావు మామూలుగానే విసవిసా ఇంట్లోకి వచ్చి మంచంమీద కూలబడి కప్పుకేసి దృష్టి సారించగానే దిమ్మతిరిగి పోయింది. కళ్ళు బైర్లు గమ్మాయి. గావుకేక పెట్టాడు. దిగ జారిన గుండెలతో అందరూ ముందు హాల్లో కొచ్చారు.

"అది కాదు అల్లుడూ, అసహ్యంగా వున్న సాలెగూడును దులిపితే ఇదిలా అంటుందేమిటీ" అంటూ అత్త సాగదీయబోయింది.

సాంశివరావుకు ఒళ్ళూపై తెలియలేదు. పళ్ళు పట పట కొరుకుతూ హుంకరించి మీదికి దూకేలోగా భార్య అడ్డుకుంది. అత్త బజారు లోకి పారిపోయింది.

చిన్నప్పుడే మరిచిపోయిన తిట్లన్నీ ఒక్కొక్కటే దొర్లి వస్తున్నాయి అతని నోటి వెంట. తన జీవితమే నాశనమై పోయిందా అనిపించిందాక్షణంలో. ఫిట్సు వచ్చినంత పనైంది. వివశుడై మంచంమీద కూలబడ్డాడు.

బజారులో అత్తగారు అల్లుని అసమర్థతను వివరించటానికొక మీటింగు నేర్పరిచి అనర్గళంగా, ధారావాహిగా ఉపన్యసిస్తూంది.

సాంబశివరావు బాధగా, మెల్లగా కళ్ళు తెరిచి భార్యతో ఇలా అన్నాడు: "ఏయ్! అది ఇంకా ఇక్కడుంటే ఖూనీ చేస్తానని చెప్పు."

అంతే. అంతటా నిశ్శబ్దత అలముకుంది. సర్వనాశనమైనట్లు సాంబశివరావు భావిస్తున్నాడు. కాని ఈ ఉదంతం తెలిసిన బంధుమిత్రులంతా సాంబశివరావుకు పిచ్చెక్కిందనుకున్నారు. అందరూ అతన్ని ఏవగించుకున్నారు. క్రమంగా తనను తానే సమాధాన పరుచుకోజూచాడు రావు. వెనకటి మంచి పెద్దల పోలికలు గుర్తుకు వచ్చాయి. 'పోన్లే. ఉన్న కాస్త చెడూ సమూలంగా నాశనమై పోయింది. మంచిదే.' కాని అతని బాధ తొలగిపోలేదు. తనకు ప్రియమైన పాత వస్తువుస్థానే ఇంకోటి చేరడం ఇష్టంలేక ఆ మూలన మామూలుగానే తుడిపించాడు. ఈ చెడు స్థానంలో తనలోనే ఏదో చెడును ప్రతిష్ఠించాలనుకున్నాడు. కాని ఎట్టిచెడూ మంచిదిగా తట్టలేదు. మంచిదైన చెడును అన్వేషించాలని తన బాల్య మిత్రుల సమావేశంలో ప్రతిపాదించాడు. కాని వారెవ్వరూ మంచిని విశేషణంగా కలిగిన చెడును సూచించలేక పోయారు.

సాంబశివరావు మంచంమీద పడుకొని ఖాళీఅయిన మూలవైపు చూస్తున్నాడు. ఈ సాలెగూడు వలన తను అభివృద్ధి పొందాడు. మరి ఇప్పుడు అది అదృశ్యమై పోయింది. తన అదృష్టం దానిననుసరిస్తుందేమో! అతడు కళ్ళు మూసుకున్నాడు... బర్రెదూడలు చని పోయాయి. బర్రెలు తన్ని పోగాయి. పాడిలేదు. పంటలు పండలేదు. చచ్చిన ముసలావిడ విల్లు ఒకటి కోర్టులో నర్తిస్తూంది. ఈ ముదిమిలో అత్తగారికి పుత్రసంతానం కలిగింది. గుమాస్తాగిరీ ఊడింది. మిగిలిన ఈ పూరింటికి నిప్పంటుకుంది. సాలెగూడు స్థావరమేర్పరచుకున్న మూలన వివిధమైన రంగులతో మంటలు మింటికి నాల్కలు చాస్తూ ఉన్నాయి... సాంబశివరావు ఉలిక్కిపడి లేచాడు. బయట వాన కురుస్తూంది. ఇదంతా జరిగిపోయిందో, జరుగుతూందో, జరగనున్నదో తెలియటం లేదు.

అతడు మర్నాటి నుండీ కప్పు మూలను దులపకుండా ఉంచాడు, ఏదైనా సాలెగూడును ఏర్పరుస్తుందనే ఆశతో. సంవత్సరాలు దొరలిపోతున్నా ఇంతవరకూ అతని ఇంటిలో సాలెగూడే ఏర్పడలేదు. ★